# జైలు కథలు 20

## "అన్నకోసం"

"..." పిలుపు వెంటనే తలెత్తి చూశాను ఆలోచనలకు ఆనకట్ట వేశాను.

"బాహర్ ఏక్ ఆద్మీ ఆప్‌కో బులాతాహై" కానిస్టేబుల్ రహీమ్ చెప్పి వెళ్ళిపోయాడు. బయటకు అడుగులు వేశాను. ఎందరో వస్తుంటారు. ఎందరో పోతుంటారు. కొందరు యిండ్లకు కొందరేమో జైలుకు. కాని ఎవరైనా కొంతకాలం రిమాండ్‌లో వుండక తప్పదు. అది ఎలాటి నేరమైనా సరే.

బయటకు నడచి నా కొరకు వేచివున్న తనివేపు చూశాను యువకుడు పందొమ్మిదో యిరవయో సంవత్సరాలమధ్య వుండవచ్చు. కళ్ళు నిర్మలంగా వున్నాయి. చదువుకున్న లక్షణాలు కనిపిస్తున్నాయి. కాని బాధతో ముఖం ముడుచుకుపోయినట్లుగా వున్నది. అతన్ని చూడగానే జాలి కలిగింది. అది జాలికి స్థానం కాదని తెలిసినా. నా మనసెందుకో అతన్ని దోషిగా ఊహించ లేకుండా వుంది. కారణం మనసుకే తెలియాలి.

"ఎవరు కావాలి?"

"మీరే" వెంటనే వచ్చిన సమాధానంలో మంచితనం తొంగి చూసింది. "చెప్పండి" అన్నాను.

"నేను నేరస్థుడిని" నవ్వాను. పరిచయం చాల బాగుం దనుకున్నాను. "కాస్త వివరంగా చెప్పండి" అని అతన్ని అన్నం పంచే కట్టవద్దకు తీసుకెళ్ళాను. పేరుతో నిమిత్తం లేకుండానే ప్రారంభించాడు. నేను మౌనంగా వింటున్నాను.

"మాది మహబూబ్‌నగర్ తాలూకాలోని చిన్న గ్రామం. మామూలుగా అన్నిగామాల్లో వలే మాకూ గ్రామకక్షలు. ముఠా తగాదాలు వున్నాయి ఇరువర్గాలమధ్య కక్షలు. కార్పణ్యాలు వున్నాయి. పట్వారీ. పటేలుది ఒకవర్గం. సర్పంచి. మోతుబరిరైతు శంకరయ్యది వేరొక వర్గం పూర్వం శంకరయ్యగారి వర్గానిదే పైచేయి. కాని యువకులు కొంతమంది. శంకరయ్య ఏమంత మంచివాడు కాడనే నిర్ణయానికి వచ్చి. పట్వారీ. పటేల్ వర్గానికి మద్దతు ఇస్తున్నారు పర్యవసానం వూహించ లేకున్నా. పగలు మాత్రం పెరుగుతూనే వున్నాయి. సీలింగులో శంకరయ్య పొలం పది ఎకరాలు కొందరు గ్రామ హరిజనులకు దక్కింది. దానిని పనిగట్టుకొని పట్వారీ. పటేల్ చేయించారని అక్కసుగా వున్నాడు శంకరయ్య. నా అన్న మాదయ్య శంకరయ్య దగ్గర పాడిగం (జీతం) చేస్తుండే వాడు. మా తల్లికి మేము యిద్దరమే సంతానం. నేను మహబూబ్‌నగర్‌లో యింటర్ రెండవ సంవత్సరం చదువుతూ వున్నాను.

ఒక రోజు కాలేజీలో వుండగా నాకొరకు మనిషి వచ్చాడు. అతని ద్వారా నేను విన్న




వార్త నన్ను కలవరపెట్టింది. బస్ దిగి ఒంటరిగా వస్తున్న పట్వారీని ఎవరో హత్య చేశారు. ఎవరూ సమీపంలో లేక పోవటంవల్ల ఎవరు చేసింది తెలియదు. ఇది కుటుంబ తగాదా ఫలితం అంటారు అంతా. అంటే పట్వారీ మొదటి భార్యను వదలి వేసి. వేరే పెండ్లి చేసుకున్నాడు ఆస్తి కొరకై. కాని యిది అవకాశంగా తీసికొని సర్పంచి శంకరయ్య వర్గంపై అనుమానం కేసు వ్రాసి పంపాడు పటేల్. వెంటనే శంకరయ్య వర్గం వారిని పది మందిని అరెస్టు చేశారు. అందులో నా అన్న మాదయ్య కూడా వున్నాడు. మా అమ్మ దిక్కుతోచక ఏడుస్తూంది. నేను వెంటనే కాలేజీకి సెలవు వ్రాసి మా గ్రామం వెళ్ళిపోయాను. శంకరయ్యగారి బంధువొకాయన బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నట్లుగా తెలిసి కాస్త వుపశమనం పొందింది. అమ్మకు ఓదార్పు చెప్పాను. నెల రోజులకు కండిషన్ బెయిల్ దొరికింది. ఈ పది మంది ముద్దాయిలు మహబూబ్‌నగర్ వదలి వెళ్ళారు. ప్రతి దినం పోలీస్టేషన్‌లో హాజరుకావాలి. అమ్మ కూడా మహబూబ్‌నగర్ వచ్చింది. కేసు సెషన్ కోర్టుకు విచారణకు వచ్చింది. వాయిదాలు జరుగుతూ వున్నాయి. పటేల్ సృష్టించిన సాక్ష్యాలు గట్టిగా వున్నాయి.

ఈరోజు నేను కాలేజీకి బయలుదేరే సమయంలో శంకరయ్యగారు నా రూంకు వచ్చారు "మాదన్నకు చాల జ్వరంగా వుంది. కోర్టుకు రాలేదు కోర్టుకు హాజరు కాకపోతే అరెస్టు వారంటు ఇస్తారు. ఈరోజు విచారణేగాని తీర్పు కాదు. నీవు వస్తే లెఖ్ఖకు సరిపోతాము" అన్నాడు. మాఅన్న. నేను కుడి ఎడంగా ఒకేలా వుంటాము. నేను హాజరయాను. చెప్పటం ఆపాడు.

"ఏమైంది" క్యూరియాసిటీ తొందరపెట్టింది. నా వంక అదోలా చూశాడు. కళ్ళల్లో జీవం లేదు. "ఈ రోజే తీర్పు. అందరకూ జీవిత ఖైదు పడింది. నేను బెదరిపోయి వున్న వాస్తవం చెప్పాను. నన్ను ఆ శిక్ష నుంచి తప్పించి. మోసం. దగా నేరం క్రింద (cr p.C.420) కేసు నమోదు చేశారు."

"ఫరవాలేదు నేరం అంగీకరించావు కాబట్టి శిక్ష తగ్గుతుంది" నా గొంతులో కూడా విచారం ధ్వనించింది. చట్టానికి అవసరాలు గుర్తుండవని అతనికేం తెలుసు పాపం.!

—'ప్రసాద్'